క్లుప్తంగా

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించండి

బోట్‌క్లబ్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వార్డు స్థాయిలో ప్రజలకు తెలియజేయాలని వికసిత భారత జిల్లా కన్వీనర్ రంభాల వెంకటేశ్వరరావు అన్నారు. బీజేపీ నాయకులు మంగళవారం నగరంలో ఉదయం 11, 12, 13, మధ్యాహ్నం 4, 5, 9 డివిజన్‌లో ప్రధాని మోది సంకల్పించిన వికసిత భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. చిట్ట చివర వ్యక్తికి కూడా సంక్షేమ ఫలాలు అందాలన్నదే బీజేపీ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నగర కన్వీనర్ గట్టి సత్యనారాయణ, రాష్ట్ర మేధావుల విభాగం కన్వీనర్ ముత్తా నవీన్‌కృష్ణ, రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర పోటీలకు సన్నద్ధం చేయాలి

కరప: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలలో మండల స్థాయిలో గెలుపొందిన జట్లను నియోజకవర్గ స్థాయి పోటీలకు సన్నద్ధం చేయాలని ఆయా గ్రామాల కార్యదర్శులకు ఎంపీడీఓ కె.అప్పారావు మంగళవారం సూచించారు. ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలలో క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించగా మండల స్థాయిలో పురుషులు, మహిళల విభాగాల్లో 10 జట్లు నియోజకవర్గ స్థాయికి ఎంపికయ్యాయన్నారు. ఈ పది జట్లు కాకినాడలోని జిల్లా క్రీడా ఆథారిటీ చెందిన క్రీడామైదానంలో ఈనెల 24వ తేదీన ఉదయం 7 గంటలకు హాజరవ్వాలని క్రీడాకారులకు తెలియజేసి, కార్యదర్శులు తీసుకెళ్లాలన్నారు. నియోజకవర్గస్థాయి పోటీలు ముగిసేవరకు దగ్గరుండి క్రీడాకారులను ప్రోత్సహించి, జిల్లాస్థాయికి ఎంపికయ్యేలా కృషిచేయాలని ఎంపీడీఓ అప్పారావు కోరారు.

డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన



డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న కురసాల సత్యనారాయణ తదితరులు

కాకినాడ రూరల్: మండలంలోని రమణయ్యపేట గ్రామ పరిధిలో పలు చోట్ల డ్రైనేజీల నిర్మాణానికి నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ మంగళవారం శంకుస్థాపనలు చేశారు. మండల ఇంజినీర్ వాసుదేవరావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లింగం రవి, వైఎస్సార్ సీపీ నాయకులు గంజా సత్తిబాబు, జంగా గగారిన్, రేఖారెడ్డి, ధర్మారావు తదితరులతో కలసి డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టేందుకు కొబ్బరి కాయలు కొట్టారు.

ఉచితంగా గుడ్లు పంపిణీ

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు లయన్స్ క్లబ్ కాకినాడ ప్రొఫెషనల్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా గుడ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వరరావు పాల్గొని గుడ్డు విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కాకినాడ ప్రొఫెషనల్‌కు చెందిన ద్వారంపూడి అవినాష్ రెడ్డి, రవికుమార్, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

లవకుశలో నటించడం పూర్వజన్మ సుకృతం

కుశుడు పాత్రధారి నాగ సుబ్రహ్మణ్యం

పెద్దాపురం: లవకుశ చిత్రంలో నటించడం నా పూర్వజన్మ సుకృతమని కుశుడు పాత్రధారి వియ్యూరి నాగ సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలో ప్రముఖ న్యాయవాది సీహెచ్ కనకదుర్గారావు ఇంటికి వచ్చిన ఆయన మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. లవకుశ చిత్రంలో నటించిన వారందరూ గతించినా తాను మాత్రమే జీవించి ఉన్నానన్నారు. ఆ సినిమా తరువాత సీతారామ కళ్యాణం, వెలుగునీడలు, శ్రీ వెంకటేశ్వర మహత్యం సినిమాల్లో నటించానన్నారు. అనంతరం ఆయనను సన్మానించారు. న్యాయవాది దుర్గారావుతో పాటు పుట్టా సోమన్నచౌదరి, హరి గోపాలశర్మ, శ్రీనివాసరావు తదితరులున్నారు.

రేపు జాతీయ ఓటర్ల దినోత్సవం

ఈఆర్వో నాగ నరసింహారావు



అధికారులతో సమీక్షిస్తున్న ఈఆర్వో నాగనరసింహారావు

కాకినాడ: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా 'ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలి– వినియోగించుకోవాలి' అనే నినాదంతో ఈ నెల 25వ తేదీన కాకినాడలో ర్యాలీ, సమావేశం నిర్వహిస్తున్నట్లు సిటీ నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. కార్యక్రమం ఏర్పాట్లపై ఏఈఆర్వోలు, నగరపాలక సంస్థ అధికారులు, వివిధ సేవా సంస్థల ప్రతినిధులతో మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు ఓటు విలువ తెలియజేయడం, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు పొందడంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో పీఆర్ ప్రభుత్వ కళాశాల నుంచి స్మార్ట్ సిటీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం స్మార్ట్ సిటీలో సమావేశం జరుగుతుందనిచెప్పారు. జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డాక్టర్ కృత్తికా శుక్లా, జేసీ ఇలక్కియ, ఎస్పీ ఎస్.సతీష్ కుమార్, ఇతర అధికారులు స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రతినిధులు, విద్యార్థులు హాజరవుతారన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్యవంతం చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమ నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఆయన అధికారులకు సూచనలు ఇచ్చారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఏఈఆర్వోలు కేసీహెచ్ దొర, మురళీకృష్ణ, జాన్‌బాబు, వరహాలయ్య, యూనివర్సిటీ ఆఫ్ డెమొక్రసీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ జి. అబ్బయ్య పలువురు ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన అధికారులు



కలెక్టర్ కృతికా శుక్లాను కలసిన తహసీల్దార్ చల్లన్‌దొర, డీఈఈ వెంకటరాజు

కాకినాడ సిటీ: సాధారణ బదిలీల్లో భాగంగా ఏలూరు కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న కె.చల్లన్‌దొర కాకినాడ అర్బన్ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను, జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ, డీఆర్వో కె శ్రీరమణిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

డీఈఈ బాధ్యతల స్వీకరణ

ప్రస్తుతం ఏపీఈడబ్ల్యూడీసీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పని చేస్తున్న కె.వెంకటరాజు అదనపు బాధ్యతలతో కాకినాడ జిల్లా సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ రూరల్: కాకినాడ డి4 సెక్షన్ పరిధిలోని 33/11 కేవీ శశికాంత్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.ప్రసాద్ తెలిపారు.11కేవీ ఆర్టీవో కార్యాలయం ఫీడర్ పరిధిలోని జవహర్ అపార్ట్‌మెంట్ ప్రాంతం, తోట సుబ్బారావు నగర్, విద్యానగర్, హెచ్‌పీ గ్యాస్ కంపెనీ, స్టేడియం, డీసీసీ బ్యాంక్ వీధి ఆశ్రమ స్కూల్ ఏరియా, దొర అపార్ట్‌మెంట్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు, ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించాల్సిందిగా ప్రసాద్ కోరారు.

కాంగ్రెస్ నాయకుల రాస్తారోకో

కాకినాడ: రాహుల్ గాంధీ జోడో యాత్రపై అస్సాంలో జరిగిన రాళ్ల దాడిని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు మంగళవారం రాస్తారోకో చేశారు. స్థానిక కల్పన సెంటర్‌లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుకూరి పాండురంగారావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. కాంగ్రెస్ కార్యాలయం నుంచి ప్రదర్శనగా కల్పన సెంటర్‌కు వెళ్లి అక్కడ ఆందోళన చేశారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న కురసాల సత్యనారాయణ, డీఎల్‌డీఓ నారాయణమూర్తి

కాకినాడ రూరల్: రమణయ్యపేట వైద్యనగర్‌లో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని నలుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.8.5 లక్షల విలువైన చెక్కులను నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు వారి వైద్య అవసరాల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌తో ముఖ్యమంత్రి జగన్ ఆదుకుంటున్నారన్నారు. నియోజవర్గంలో అత్యధిక సంఖ్యలో సీఎం రిలీఫ్ ఫండ్‌ను ఎమ్మెల్యే కన్నబాబు అందించారన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరీ



గాత్ర కచేరీ చేస్తున్న కల్యాణపురం ఆనంద్

బోట్‌క్లబ్: సంగీత విద్వత్సభ ఆధ్వర్యంలో సంక్రాంతి సంగీత నృత్యోత్సవాల్లో భాగంగా స్థానిక సూర్య కళా మందిరం మంగళవారం రాత్రి చెన్నైకు చెందిన కళ్యాణపురం ఆనంద్ గాత్ర కచేరి వీనుల విందుగా సాగింది. కాంభోజి వర్ణంతో ప్రారంభించి, సింహేంద్ర మధ్యమంలో రాగం తానం పల్లవి చేసి, వివిధ వాగ్గేయకారులు రచించిన రామచంద్ర మూర్తి కృతులను చక్కగా గానం చేశారు. వీరికి వయొలిన్‌పై పప్పు జ్ఞానదేవ్, మృదంగంపై బుర్రా శ్రీరాం, ఘటంపై ఎం.హరిబాబు చక్కటి సహకారాన్ని అందించారు. ఎస్.సీత, టీవీ రావు, వక్కలంక రామకృష్ణ పాల్గొన్నారు.

గొప్ప దేశభక్తుడు నేతాజీ



నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కరప: మండలం గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎ.సాయి మోహన్ ఉపాధ్యాయులతో కలసి నేతాజీ చిత్రపటానికి పూల మాల వేసి, నివాళులర్పించారు. నేతాజీ జయంతిని దేశవ్యాప్తంగా పరాక్రమ్ దివస్‌గా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు మాట్లాడుతూ అఖిల భారత సివిల్ సర్వీస్ పరీక్షలో నేతాజీ 4వ ర్యాంక్ సాధించినా దేశానికి స్వాతంత్ర్యం సాధించాలనే పట్టుదలతో స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న గొప్ప దేశభక్తుడిగా పేర్కొన్నారు. ఉపాధ్యాయులు టి.వేణుగోపాల్, వీవీ రమణమూర్తి, సీహెచ్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి ఆర్మీ విశ్రాంత ఉద్యోగి ఎస్.శ్రీనగేష్, అడబాల రత్నప్రసాద్, కొమ్మూరి శ్రీనివాసరావు తదితరులు నివాళులర్పించారు.

టీడీపీ-జనసేనలను నమ్మొద్దు

ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: అధికారం కోసం ఒక్కటైన టీడీపీ–జనసేన పార్టీలను నమ్మొద్దని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రజలకు సూచించారు. స్థానిక 25వ డివిజన్‌లో మంగళవారం నిర్వహించిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారంపూడి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ప్రదర్శన ఫలకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని అమలు చేయకుండా ప్రజలను దగా చేసిన టీడీపీ ఇప్పుడు అధికారం కోసం జనసేనతో చేతులు కలిపిందన్నారు. ప్రజల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న జగన్ సర్కార్‌పై బురదజల్లడమే పనిగా తప్పుడు ఆరోపణలు చేస్తూ ఆచరణ సాధ్యం కాని హామీలు ఇస్తున్న ఆ రెండు పార్టీలను నమ్మొద్దని కోరారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న సీఎం జగన్‌ను మరోసారి ఆదరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, స్థానిక పార్టీ నాయకులు జగన్నాథన్ విజయ్‌కుమార్, బత్తిన పైడిరాజు, పలువురు నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.

కేంద్రీయ విద్యాలయలో చిత్రలేఖన పోటీ



కేంద్రీయ విద్యాలయలో చిత్రాలను గీస్తున్న విద్యార్థులు

కాకినాడ రూరల్: మండలంలోని వలసపాకల గ్రామంలోని కేంద్రీయ విద్యాలయలో పరీక్షా పే చర్చ కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు పెయింటింగ్ పోటీ నిర్వహించారు. కాకినాడ, పరిసర గ్రామాలకు చెందిన సుమారు వంద మంది పోటీలో పాల్గొన్నారు. పరీక్షలపై భయం పోగొట్టడానికి ప్రధాని నరేంద్ర మోదీ సూచించిన కొన్ని విషయాలు అనుసరించి విద్యార్థులు చిత్రాలు గీయగా న్యాయ నిర్ణేతలు ఐదింటిని ఎంపిక చేశారు. పోటీలలో పెద్దాపురం నవోదయ విద్యాలయ, ఆశ్రమ పబ్లిక్ స్కూల్, అక్షర పబ్లిక్ స్కూల్, లక్ష్య స్కూల్, శరణ్య కాన్సెప్ట్ స్కూల్, శ్రీ చైతన్య టెక్నో స్కూల్, లిటిల్ వుడ్ స్కూల్ నుంచి విద్యార్థులు హాజరు కాగా పాల్గొన్నవారికి ప్రమాణ పత్రాలతో పాటు పీఎం నరేంద్రమోదీ రచించిన ఎగ్జామ్ వారియర్స్ పుస్తకాన్ని అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాధామాధవి, సంజయ్ వ్యవహరించగా కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ శేఖర్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

27న 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు

- నియోజకవర్గ స్థాయిలో నిర్వహణ
- కమిషనర్ నాగనరసింహారావు వెల్లడి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా మండల స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు 27వ తేదీన నియోజకవర్గస్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. పోటీల నిర్వహణపై మంగళవారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయంలో నగరపాలక సంస్థ అధికారులు, ప్రత్యేక అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మండలస్థాయి నుంచి ప్రతిభ కనబరిచి నియోజకవర్గస్థాయికి ఎంపికైన వారికి ఈ పోటీలు జరుగుతాయన్నారు. 27న పీఆర్ కళాశాలలో వాలీబాల్ పోటీలు, జిల్లా క్రీడామైదానంలో క్రికెట్, ఖో-ఖో, కబడ్డీ పోటీలు, రామారావుపేటలో బ్యాట్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. నియోజకవర్గస్థాయిలో ప్రతిభకనబరచిన వారిని జిల్లాస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. పోటీల నిర్వహణకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆయన ఆయా విభాగాల అధికారులకు సూచించారు. సమావేశంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, స్మార్ట్‌సిటీ ఎస్ఈ ఎం.వెంకట్రావు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఈఈ మాధవి, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, ఉద్యాన సహాయ సంచాలకుడు టీవీ సిరిల్, డీఎస్ఏ కోచ్ సురేష్, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ఉమర్ ఆలీషా బోధనలు మతాతీతం

జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజు



వీసీ ప్రసాదరాజును సత్కరిస్తున్న అహ్మద్ ఆలీషా, నాగమణి తదితరులు

కాకినాడ రూరల్: మతాతీతమైన విద్య, విజ్ఞానాన్ని బోధించిన మహనీయుడు కవిశేఖర డాక్టర్ ఉమర్ ఆలీషా అని జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజు పేర్కొన్నారు. బోట్‌క్లబ్ వద్ద మంగళవారం ఉదయం కవిశేఖర ఉమర్ ఆలీషా 79వ వర్ధంతి కార్యక్రమంలో ప్రసాదరాజు, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, భవర్‌లాల్, కవి శిరీష, హుస్సేన్ షా తదితరులు అతిథులుగా హాజరయ్యారు. పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా సోదరుడు అహ్మద్ ఆలీషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత కవిశేఖర ఉమర్ ఆలీషా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అహ్మద్ ఆలీషా మాట్లాడుతూ కవిశేఖర డాక్టరు ఉమర్ ఆలీషా బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నారు. మహాపండితుడిగా, బహు గ్రంథకర్తగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా, శాసన సభ్యుడిగా, మేధావిగా పేరొంది సేవలందించారన్నారు. పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, ఏవీవీ సత్యనారాయణ, సలాది రమేష్, మండా ఎల్లమాంబ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు, ప్రసాద వితరణ చేసి, అతిథులను సత్కరించారు.

పథకాలపై అవగాహన పెంచుకోండి



వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్ నాగనరసింహారావు తదితరులు

కాకినాడ: పేద ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రజలు అవగాహన కల్పించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు సూచించారు. స్థానిక రెవెన్యూ కాలనీ పార్క్, గుడారిగుంట ప్రాంతాల్లో మంగళవారం జరిగిన వికసిత్ భారత్ సంకల్పయాత్రలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్, పీఎం స్వనిధి, ముద్ర, ఉజ్వల యోజన వంటి ఎన్నో పథకాలను కేంద్రం అమలు చేస్తోందన్నారు. అర్హత కలిగిన లబ్ధిదారులు పథకాలను వినియోగించుకుని ప్రయోజనం పొందాలని కమిషనర్ సూచించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలను మొబైల్ వాహనం ద్వారా ప్రజలకు వివరించారు. అభివృద్ధికి పునరంకితమవుతామని అక్కడకు వచ్చిన ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు టీపీఆర్వో మానే కృష్ణమోహన్, బీజేపీ నేతలు ఎనిమిరెడ్డి మాలకొండయ్య, గట్టి సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు.

తురగాకు శివ పార్వతి అవార్డు



తురగా సూర్యారావును సత్కరిస్తున్న నిర్వాహకులు

బాలాజీచెరువు: కాకినాడకు చెందిన విశ్రాంత పోస్టుమాస్టర్ తురగా సూర్యారావును 'శివ పార్వతి అవార్డ్స్–2024' వరించింది. హైదరాబాద్‌కు చెందిన సూర్య చంద్ర కల్చరల్ ఆర్గనైజేషన్ నిర్వహించిన 'శివ పార్వతి అవార్డ్స్–2024' అధ్యక్షుడు మోహన్‌చంద్ర అధ్వర్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో నిర్వహించారు. డాక్టర్ చిల్లా రాజశేఖరరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చిన్నారులు నిర్వహించిన కుచిపూడి, భారత నాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులుగా జస్టిస్ బూర్గుల మధుసూదన్, అతిథిగా డాక్టర్ తురగా సూర్యారావు, భాగ్యలక్ష్మి రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, చందు, అంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యారావును దుశ్శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. పోస్ట్ మాస్టర్ టి.అమ్మిరాజు, పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, కె.ప్రసాదరావు పి.సాగర్, సంపర శ్రీనివాసరావు, అనిత, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు టి.గాలీబు తదితరులు తురగాను అభినందించారు.